క్లుప్తంగా

'వ్యవసాయ' పరికరాలపై జీఎస్టీ తగ్గింపు

కొల్లిపర: కేంద్ర ప్రభుత్వం రైతులకు ఉపయోగకరంగా ఉండేలా, భారం తగ్గించే విధంగా వ్యవసాయ యంత్ర పరికరాలు, డ్రోన్లు, బయోపెస్టిసైడ్స్, పాల ఉత్పత్తులపై జీఎస్టీ రేట్లు గణనీయంగా తగ్గించినట్లు జీఎస్టీ డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ జి.శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం జీఎస్టీ తగ్గింపుపై అత్తోట గ్రామంలో వ్యవసాయాధికారుల ఆధ్వర్యంలో సూపర్ సేవింగ్స్ కార్యక్రమం నిర్వహించి, రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఉపయోగకరంగా ఉండే వాటిపై జీఎస్టీ తగ్గించటం వలన రైతుకు ఒక ఎకరానికి సుమారు రూ.1700 నుంచి రూ.5వేల వరకు ప్రయోజనం కలుగుతుందన్నారు. జీఎస్టీ ఏఏ పరికరాలపై ఎంత శాతం తగ్గింది అన్న అంశాలను వివరించారు. ఏఓ శ్రీనివాసరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

జిల్లా వైద్యశాలకు మార్చురీ వాహనం వితరణ

తెనాలిఅర్బన్: హార్వెస్ట్ ఇండియా సంస్థ ఆధ్వర్యంలో నూతనంగా కొనుగోలు చేసిన మార్చురీ వాహనాన్ని బుధవారం ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ చేతుల మీదుగా జిల్లా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సౌభాగ్యవాణికి అప్పగించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ హార్వెస్ట్ ఇండియా నిర్వాహకులు డాక్టర్ కత్తెర సురేష్, జడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా దంపతులు తమ సొంత నిధులతో వాహనాన్ని సమకూర్చడం అభినందనీయమన్నారు. అనంతరం వాహనానికి సంబంధించిన పత్రాలను సూపరింటెండెంట్‌కు అందజేశారు. టీడీపీ నాయకులు సుద్దపల్లి నాగరాజు, మహ్మద్ ఖుద్దూస్, ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

నల్లబ్యాడ్జీలతో పింఛన్ల పంపిణీ

తెనాలిఅర్బన్: సచివాలయ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జేఏసీ పిలుపు మేరకు తెనాలి పట్టణంలో సచివాలయ ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు, చొక్కాలు ధరించి బుధవారం పింఛన్లు పంపిణీ చేశారు. తమ సమస్యలు పరిష్కారమయ్యేవరకు ఇదే విధంగా నిరసన తెలియజేస్తామని ప్రకటించారు. పట్టణంలో మొత్తం 15,072 పింఛన్లకు గాను 14,201 పింఛన్లను పంపిణీ చేసినట్లు అధికారులు తెలియజేశారు.

తెనాలిటౌన్: రూరల్ మండలం హాఫ్‌పేట గ్రామంలో బుధవారం ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, జడ్పీ చైర్మన్ కత్తెర హెనీ క్రిస్టినా వృద్ధులకు, వికలాంగులకు సామాజిక భద్రత పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కత్తెర సురేష్‌కుమార్, పలువురు టీడీపీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.



మహిషాసురమర్దనిగా బోసురోడ్డులోని శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి



దేవీచౌక్‌లో..



మారీస్‌పేట శివాలయంలో..



రామలింగేశ్వరపేటలోని రామేశ్వరాలయంలో...



కొలకలూరులోని శ్రీగంగాపార్వతీ సమేత అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో..



కొల్లిపర జనార్దన స్వామి దేవాలయంలో..

జయ.. జయహే మహిషాసుర మర్దని!

దసరా పర్వదినంలో భాగంగా జరుగుతున్న శ్రీదేవీ శరన్నవరాత్రి మహోత్సవాల్లో పదో రోజైన బుధవారం పలు దేవాయాల్లో అమ్మవారు శ్రీమహిషాసుర మర్దనిగా భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు భక్తిశ్రద్ధలతో అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.

– తెనాలి/కొల్లిపర/తెనాలిటౌన్



నందివెలుగులో శ్రీ ధనలక్ష్మీదేవిగా..



కఠెవరంలో మహిషాసురమర్దనిగా..



శ్రీదేవీ శరన్నవరాత్రుల్లో భాగంగా స్థానిక రామలింగేశ్వరపేటలోని శ్రీగంగా పార్వతీ సమేత శ్రీరామలింగేశ్వరస్వామి దేవస్థానం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన బొమ్మల కొలువు

ఇరిగేషన్ కాల్వకట్టపై చెట్లు నరికివేత

యథేచ్ఛగా ట్రాక్టర్లలో తరలింపు

తెనాలిటౌన్: గుర్తు తెలియని దుండగల కన్ను ఇరిగేషన్ కెనాల్ మధ్య కట్టపై గల భారీ వృక్షాలపై పడింది. ఇదే అదునుగా బుధవారం ఉదయం భారీ కట్టర్‌లతో వైకుంఠపురం ఎదురుగల మధ్య కట్టపై పెద్ద చెట్లను నరికి ట్రాక్టర్లల్లో తరలించారు. సేకరించిన వివరాల ప్రకారం... కృష్ణా పశ్చిమ డెల్టా పరిధిలోని తెనాలి కార్యాలయం సమీపాన మధ్య కాల్వకట్టపై వైకుంఠపురం నుంచి టిడ్కో ఇళ్ళ మధ్య గల కాల్వకట్టపై భారీ వృక్షాలను ఉదయం సమయంలో కొందరు అగంతకులు కట్టర్‌లతో దుంగలను కత్తిరించి తరలించే ప్రయత్నం చేస్తుండగా స్థానికులు మీడియాకు సమాచారం ఇచ్చారు. దీంతో అక్కడకు విలేకరుల రాకను పసిగట్టిన దుండగులు చెట్ల దుంగలను వెంట తెచ్చిన క్రేన్ సాయంతో ట్రాక్టర్‌లో పెదరావూరు వైపు తరలించారు. ప్రశ్నించినవారికి సమాధానం ఇవ్వకుండా పరుగులు పెట్టారు. దుంగలను నరుకుతున్న చేస్తున్న కూలీలు అక్కడి నుంచి తమ వాహనాలపై జారుకున్నారు. దీనిపై అధికారులను వివరణ కోరగా సరైన సమాధానం లేదు.



పెదరావూరు వైపు ట్రాక్టర్‌లో అక్రమంగా తరలిస్తున్న దుంగలు

కళలను ప్రోత్సహించే జాతి పురోగమిస్తుంది

తెనాలి: కళారూపాలను ప్రోత్సహించిన జాతి చైతన్యంతో పురోగమిస్తుందని సీపీఐ నేత పరుచూరి వెంకటేశ్వరరావు అన్నారు. ప్రఖ్యాత సినీ హాస్యనటుడు అల్లు రామలింగయ్య సందేశం కూడా అదేనని గుర్తుచేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి, తెనాలి శాఖ ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం స్థానిక 'ఇస్కఫ్' హాలులో సినీనటుడు అల్లు రామలింగయ్య వర్ధంతిని జరిపారు. ప్రజానాట్యమండలి నియోజకవర్గ అధ్యక్షుడు ముక్కాల మాణిక్యాలరావు అధ్యక్షత వహించారు. పరుచూరి తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ, రచయితలు, కళాకారులు సందేశాత్మక రచనలు చేసి సమాజ చైతన్యానికి కృషిచేయటమే మహానటులకు ఇచ్చే నివాళిగా చెప్పారు. అల్లు రామలింగయ్య నటవైభవాన్ని మాణిక్యాలరావు వివరించారు. ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షుడు బొల్లిముంత కృష్ణ, కార్యదర్శి దేవరపల్లి నీలాంబ్రం, వెంకటేశ్వరరావు, విజయదుర్గ, విజయలక్ష్మి, అనూరాధ, మౌనిక పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పరుచూరి వెంకటేశ్వరరావు

అమ్మవారిని దర్శించుకున్న శివకుమార్



తెనాలి: దసరా పర్వదినం సందర్భంగా జరుగుతున్న శ్రీదేవీ నవరాత్రి మహోత్సవాల్లో మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ మంగళవారం రాత్రి మారీసుపేటలోని శ్రీబాలాత్రిపురసుందరీ సమేత శ్రీచంద్రమౌళీశ్వర స్వామి దేవాలయాన్ని సందర్శించారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాజీ ఎమ్మెల్యే శివకుమార్‌ను ఆలయ మర్యాదలతో సత్కరించారు. కమిటి అధ్యక్షుడు గ్రంధి సేతు మాధవరావు, కార్యదర్శి పొన్నూరు నాగసూర్య శశిధరరావు, కోశాధికారి వరదా వెంకట శేషగిరిరావు, సభ్యులు పేరుబోయిన అంకమ్మరాజు, తాడిపర్తి హరిప్రసాద్ పాల్గొన్నారు.

వృద్ధులు చట్టాలను వినియోగించుకోవాలి

తెనాలి: వయోవృద్ధులు తమ సంరక్షణ, భద్రత కోసం ప్రభుత్వం రూపొందించిన చట్టాలను సద్వినియోగం చేసుకోవాలని తెనాలి మండల తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ సూచించారు. సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్, తెనాలి ఆధ్వర్యంలో బుధవారం స్థానిక కవిరాజ పార్కులోని వీజీకే భవన్‌లో వయోవృద్ధుల దినోత్సవం జరిపారు. అసోసియేషన్ అధ్యక్షుడు మొవ్వా సత్యనారాయణ అధ్యక్షత వహించారు. సహస్ర పూర్ణ చంద్ర దర్శనం చేసిన 83 ఏళ్ల సభ్యులు, 75 ఏళ్లు నిండిన సభ్యులను మానవత, తెనాలి అధ్యక్షుడు డాక్టర్ కొలసాని రామ్‌చంద్ చేతులమీదుగా సత్కరించారు. అసోసియేషన్ కార్యదర్శి ప్రసాదం పూర్ణచంద్రరావు, ఉపాధ్యక్షులు కోటిరెడ్డి, ఈశ్వర్‌చంద్, అచ్యుత రామమూర్తి, చలమయ్య, కె.రామకృష్ణ, శివరామయ్య పాల్గొన్నారు.

జిల్లా వైద్యశాలలో...

తెనాలిఅర్బన్: వృద్ధాప్యంలో వచ్చే ఆరోగ్య సమస్యలపై అందరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సౌభాగ్యవాణి, ఫిజిషియన్ డాక్టర్ టి.వినిల్‌లు పేర్కొన్నారు. అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని జిల్లా వైద్యశాలలో బుధవారం నిర్వహించారు. డాక్టర్ దీపక్, డాక్టర్ గణేష్‌రెడ్డి, డాక్టర్ ఎస్.అన్నపూర్ణ, నర్సింగ్ అధికారిణి సుజాతభాయ్, తదితరులు పాల్గొన్నారు.

సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో

తెనాలి: ది తెనాలి సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం వయోవృద్ధుల దినోత్సవాన్ని నిర్వహించారు. అమరావతి కాలనీలోని ఎన్టీఆర్ కమ్యూనిటీ హాలులో ఏర్పాటైన సమావేశానికి అసోసియేషన్ అధ్యక్షుడు గుమ్మడి నారాయణరావు అధ్యక్షత వహించారు. తెనాలి మండల తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పరుచూరి మల్లికార్జునరావు, శాఖమూరి మల్లికార్జునరావు, దేవభక్తుని సుబ్బారావు, యు.సాంబశివరావు, కావూరి జ్ఞానదేవ్‌లను సత్కరించారు.

రేపటి నుంచి గ్రామ సభలు

కొల్లిపర: ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండలంలో శుక్రవారం నుంచి గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ విజయలక్ష్మి బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 3వ తేదీన బొమ్మువానిపాలెం, చక్రాయపాలెం, 4 దంతలూరు, కుంచవరం, అన్నవరపులంక. 6 చివలూరు 7 అన్నవరం, అత్తోట, చెముడుపాడు, దావులూరు, దావులూరిపాలెం, హనుమాన్‌పాలెం, కొల్లిపర, మున్నంగి, పిడపర్తిపాలెం, సిరిపురం, తూములూరు. 8వ తేదీ అత్తలూరివారిపాలెం, వల్లభాపురం ఆయా తేదీల్లో ఆయా గ్రామాల్లో ఉదయం10 గంటలకు గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆయా గ్రామ సభల్లో ప్రజలు వారి సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని సూచించారు.

తెనాలిలో 'డోర్ టు డెస్టినేషన్' ప్రారంభం

తెనాలి రూరల్: డిసీజ్ ఫ్రీ తెనాలి కోసం పట్టణానికి చెందిన డీ3 సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో డాక్టర్ డి.శారద చేసిన ప్రయత్నం ఫలించింది. డోర్ టు డెస్టినేషన్ పేరిట కార్యక్రమాలు నిర్వహించేందుకు కమిషనర్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ నుంచి అనుమతి లభించినట్లు బుధవారం డాక్టర్ శారద వెల్లడించారు. స్థానిక చినరావూరులో నిర్వహించిన సమావేశంలో రాష్ట్ర మహిళా కమిషన్ మాజీ చైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. డీ3 సర్వీస్ సొసైటీ తరఫున గత 30 ఏళ్లుగా డాక్టర్ శారద చేస్తున్న సేవలను ఆమె కొనియాడారు. మహిళల అనారోగ్య పరిస్థితిపై అవగాహన కల్పించి, వ్యాధులు దరి చేరకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టడమే కార్యక్రమం ముఖ్య ఉద్దేశంగా చెప్పారు. తహశీల్దార్ కేవీ గోపాలకృష్ణ, డీవీ సోమయ్య శాస్త్రి, కౌన్సిలర్ కుర్రా సుజాత, పి.శ్రీనివాసరావు, కుర్రా శ్రీను పాల్గొన్నారు.

పాస్టర్ కొలకలూరు మత్తయ్య సేవలు మరవలేనివి

తెనాలిఅర్బన్: పాస్టర్ కొలకలూరు మత్తయ్య సేవలు మరవరానివని విశ్రాంత అడిషనల్ డీజీపీ కూచిపూడి బాబురావు పేర్కొన్నారు. ఫిలడెల్ఫియా చర్చి వ్యవస్థాపకుడు కొలకలూరు మత్తయ్య వర్ధంతి సభను మారీసుపేట రెండు గేట్ల మధ్యలో మంగళవారం నిర్వహించారు. సమావేశానికి నేషనల్ క్రిష్టియన్ కౌన్సిల్ వ్యవస్థాపకులు రెవరెండ్ శ్యామ్‌పాల్ కొలకలూరి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా బాబురావు మాట్లాడుతూ మారీసుపేట ప్రాంతంలో అనేకమంది పేదలకు విద్యాబోధన, వసతి సౌకర్యాలను కల్పించారని చెప్పారు. ఆయన బాటలో అందరూ నడవాలన్నారు. ముందుగా కొలకలూరి మత్తయ్య వీధి నేమ్‌బోర్డులను ఆయన ఆవిష్కరించారు. అనంతరం అన్నదానంచేశారు. పాస్టర్లు డి.కుమార్, చిలువూరి నతానియేల్, శాంతకుమార్, కుటుంబ సభ్యులు, బంధువులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



దుకాణాల వద్ద శుభ్రత పాటించండి

మున్సిపల్ ఆరోగ్యాధికారి డాక్టర్ మొవ్వా యేసుబాబు



తెనాలిఅర్బన్: మాంసం విక్రయ దుకాణాల వద్ద శుభ్రత పాటించాలని మున్సిపల్ ఆరోగ్యాధికారి డాక్టర్ మొవ్వా యేసుబాబు ఆదేశించారు. మార్కెట్ ఏరియాలో బుధవారం ఆయన పర్యటించి దుకాణదారులకు పలు సూచనలు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గురువారం గాంధీ జయంతిని, ఆ రోజు ఎవరు మాంసం విక్రయాలు జరపకూడదని ఆదేశించారు. ఆయన వెంట పలువురు ఉద్యోగులు ఉన్నారు.